క్లుప్తంగా

ఓటు ప్రాధాన్యంపై కళాజాత



నందిగామ: ఓటర్లలో చైతన్యం కలిగించేందుకు ప్రత్యేకంగా కళాజాత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వై.సరస్వతి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం, రైతుబజార్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కళాజాతాను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఓటు విలువ తెలియజేసేందుకు ఈ కళాజాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన కళాకారులు జానపద కళారూపంలో ఓటు ప్రాధాన్యం, విలువపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ కళాజాతను వీఆర్వోలు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేసిన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును రానున్న ఎన్నికల్లో మరోసారి ఆదరించి గెలిపించాలని విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను కోరారు. స్థానిక బంగారుపేటలో శుక్రవారం రాత్రి ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. పేట పట్టణంతోపాటు నియోజకవర్గవ్యాప్తంగా కంటికి కనిపిస్తున్న అభివృద్ధి అంతా ఎవరు చేశారో ప్రజలు ఆలోచించి, అభివృద్ధికి కృషిచేసిన ఉదయభానును అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

150 మందికి వైద్యపరీక్షలు


పెనుగంచిప్రోలు: పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఎంతో మేలు కలుగుతోందని సర్పంచి వేల్పుల పద్మకుమారి అన్నారు. ఆరోగ్య సురక్ష రెండోవిడత కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సృజన పాల్గొని 150 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్యామ్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



జుజ్జూరు(వీరులపాడు): వేసవిలో పాదచారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని సర్పంచి రమావత్ కోటి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు ఇబ్బందిలేకుండా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఉపసర్పంచి పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కంచికచర్ల : అక్రమంగా మద్యం, నగదు తరలించేవారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్‌ఐ పెంకె వెంకట సత్య సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక జుజ్జూరు రోడ్డులో శుక్రవారం ఆయన వాహనాలను తనిఖీలు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం, నగదు తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా మండలంలోని కీసర టోల్‌ప్లాజా, పరిటాల శివారు దొనబండ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కానిస్టేబుళ్లు గద్దం రాంబాబు, గ్రేస్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: అపార్టుమెంట్‌లో పిల్లల వద్ద తలెత్తిన తగాదా కారణంగా వ్యక్తిపై పలువురు దాడి చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు కథనం మేరకు యనమలకుదురు పెట్రోల్ బంక్ వద్ద అమీర్‌టవర్స్‌లో వేముల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను ఏపీ సెక్రటేరియేట్‌లో ఐటీ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా గురువారం అతను ఉంటున్న అపార్టుమెంట్ ఆవరణలో పిల్లలు ఆడుకుంటూ గొడవపడ్డారు. అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న జ్యోతి కోపంతో నాగేశ్వరరావు పిల్లలను కొట్టింది. దీంతో నాగేశ్వరరావు, అతని కటుంబ సభ్యులకు.. జ్యోతికి వాగ్వాదం జరుగుతున్న సమయంలో జ్యోతికి మద్దతుగా ముగ్గురు వ్యక్తులు వచ్చి నాగేశ్వరరావుపై విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆయన గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నందిగామ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


పాత బస్టాండ్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ఈ ఐదేళ్లలో కోట్లాది రూపాయల నిధులతో నందిగామ పట్టణంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలు గమనించి, రానున్న ఎన్నికల్లో తనకు అండగా నిలవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కోరారు. పట్టణంలోని ముక్కపాటి కాలనీ, కృష్ణబలిజ నగర్ తదితర ప్రాంతాలలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ నందిగామ అభివృద్ధే లక్ష్యంగా ఐదేళ్లు పని చేశామన్నారు. గత రాజకీయపార్టీల నాయకుల మాదిరిగా ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రజల చుట్టూ తిరిగి, అధికారంలోకి వచ్చిన తరువాత ముఖం చాటేసే తత్వం తనది కాదన్నారు. గతంలో ఓడినా ఇక్కడే ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడటంతో పాటు, 2019లో గెలిచినప్పటి నుంచి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వందలాది కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి విషయంలో గతానికి, ఇప్పటికీ తేడాను గమనించాలని ప్రజలను కోరారు. పట్టణంలోని ముక్కపాటి కాలనీ, కృష్ణబలిజ నగర్ ప్రాంతాల్లోని ప్రజల అవసరాలకు తగినట్లుగా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, మురుగుదొడ్లు, అంతర్గత రహదారుల అభివృద్ధితోపాటు వార్డులో అన్ని అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న సమస్యలను సైతం తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పరిష్కరించినట్లు గుర్తుచేశారు. నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మంచి జరుగుతుందని చెప్పారు. మంచి కోరుకునే ప్రతిఒక్కరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్ విశ్వనాథపల్లి వాణి, వార్డు కన్వీనర్ విశ్వనాథపల్లి కృపారావు, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వీసం దుర్గారావు, నాయకులు షేక్ మీరా, పత్తిపాటి జయరామారావు, మత్తయ్య, పోతురాజు, పాములపాటి రమేష్, దొంతిమాల చంద్రశేఖర్, బాపట్ల సాంబయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావును ఆత్మీయంగా పలకరిస్తున్న వృద్ధురాలు

15న బీసీల ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న బత్తుల రామారావు, శ్రీనివాస్

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో ఈనెల 15వతేదీ సాయంత్రం నాలుగు గంటలకు బీసీల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు డేరంగుల శ్రీనివాస్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని బీసీ వర్గాలను రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధిపథంలోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి బాటలు వేశారని గుర్తుచేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను బీసీలకు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ వారికి మున్సిపల్ చైర్మన్, మార్కెట్ యార్డు చైర్మన్, తిరుపతమ్మ దేవస్థానం చైర్మన్ తదితర ఉన్నత పదవులు లభించేలా కృషిచేశారని గుర్తుచేశారు. అందుకు కృతజ్ఞతగా ఈనెల 15న నిర్వహించే బీసీల ఆత్మీయ సమ్మేళనానికి బీసీలంతా హాజరుకావాలని వారు కోరారు.

రేపట్నుంచి పోలింగ్ అధికారులకు శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈనెల 13,14 తేదీల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ జి.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. పేట పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగ్గయ్యపేట మండలంలో నియమింపబడిన ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. 14 వ తేదీన అదే హైస్కూల్‌లో పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తామని వివరించారు. సంబంధిత పోలింగ్ అధికారులు శిక్షణా తరగతులకు సకాలంలో హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

కంచికచర్ల : వృద్ధుడి అదృశ్యంపై అతని కుటుంబసభ్యులు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ పెంకె వెంకట సత్య సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన పానుగంటి నాగయ్య(70) ఈనెల 10వ తేదీన కూరగాయలు తీసుకువస్తానంటూ ఆటోలో కంచికచర్ల వచ్చాడు. కాని తిరిగి ఇంటికి చేరలేదు. పలుచోట్ల వెతికినా అతని ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మృతి



వత్సవాయి : మండల కేంద్రం వత్సవాయికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోపూరి పాపారావు(41) మృతి చెందాడు. గత నెలలో జగ్గయ్యపేట నుంచి ద్విచక్ర వాహనంపై వత్సవాయి వస్తున్న పాపారావును మక్కపేట శివారులోని పెట్రోల్ బంక్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. నెలరోజులుగా చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యపరిస్థితి శుక్రవారం విషమించి మృతిచెందాడు. పాపారావు జగ్గయ్యపేట మండలం గౌరవరం పాఠశాలలో పనిచేస్తున్నాడు. మృతుడికి పాపారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పాపారావు మృతిపట్ల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మన్నెపలి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శులు సుధానంద్, హుస్సేన్, మండల శాఖ అధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు తీవ్రసంతాపాన్ని వ్యక్తంచేశారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు


రాజీనామా చేస్తున్న నందిగామ మండలంలోని వలంటీర్లు


రాజీనామా చేసిన వత్సవాయి మండలం వేములనర్వ వలంటీర్లు

నందిగామ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వలంటీర్లు తమ విధులకు శుక్రవారం రాజీనామా చేశారు. అడవిరాములపాడు గ్రామానికి చెందిన ఏడుగురు వలంటీర్లు, కమ్మవారిపాలెం సచివాలయం పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు, నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జొన్నలగడ్డకు చెందిన 9మంది మొత్తం 22 మంది వలంటీర్లు వారి విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు.

జగ్గయ్యపేట మండలంలో...

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గండ్రాయిలో 18 మంది వలంటీర్లు, చిల్లకల్లులో ఇద్దరు, ధర్మవరప్పాడుతండాలో తొమ్మిదిమంది, అన్నవరం ఆరుగురు, బలుసుపాడు 12 మంది కలిపి మొత్తం 47మంది వలంటీర్లు శుక్రవారం తమ విధులకు రాజీనామా చేశారు. ఎంపీడీవో రమేష్‌బాబుకు తమ రాజీనామాపత్రాలను అందజేశారు.

వీరులపాడు మండలంలో...

జుజ్జూరు(వీరులపాడు): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 55 మంది వలంటీర్‌లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శివపార్వతి శుక్రవారం తెలిపారు. పెద్దాపురం 23మంది, వెల్లంకి, దాచవరంలో 14మంది, బోడవాడలో ఎనిమిది మంది, కొణతాలపల్లిలో పదిమంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు వివరించారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి : మండలంలోని కాకరవాయి సచివాలయ పరిధిలోని వేమవరం గ్రామ పంచాయతీకి చెందిన ఏడుగురు వలంటీర్లు తమ విధులకు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో భరత్‌రాజ్‌కు అందజేశారు.

జాతి మనుగడలో భాష కీలకం


గ్రంథావిష్కరణ సభలో జంధ్యాల శంకర్, గోళ్ళ నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: భాషా సంస్కృతి, సంప్రదాయాల కృషికి సాహిత్య సంస్థలు, ప్రభుత్వాలు కృషి చేయాలని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ అన్నారు. రసభారతి సాహితీ సంస్థ, గోళ్ళ రాధాకృష్ణ మూర్తి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం డాక్టర్ జంధ్యాల మహతీశంకర్ రచించిన పద్య మంజరి, డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు రచించిన బుద్ధుని బోధనలు– జాతక కథలు, కవి సమ్మేళనం నిర్వహించారు. పద్య మంజరి గ్రంథాన్ని ఆవిష్కరించిన జంధ్యాల శంకర్ మాట్లాడుతూ జాతి మనుగడలో భాష కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. బహుముఖ ప్రతిభాశాలి సాహితీవేత్త జంధ్యాల మహతీ శంకర్‌గా అభివర్ణించారు. జాతక కథలు గ్రంథాన్ని గోళ్ళ నారాయణరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుడు గౌతమ బుద్ధుని బోధనలు సర్వదా ఆచరణీయమన్నారు. గ్రంథాలను కవి పండిత పోషకుడు చెట్లపల్లి మారుతీ ప్రసన్నకు అంకితమిచ్చారు. రసభారతి అధ్యక్షుడు పొన్నలూరి లక్షణరావు సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ క్రోవి పార్థసారథి, డాక్టర్ జంధ్యాల జయకృష్ణ బాపూజీ మహతీ శంకర్ సాహిత్య సేవలను వివరించారు. నూతన సంవత్సర ఉగాది సందర్భంగా చలపాక ప్రకాష్, డాక్టర్ వెన్నావల్లభరావు, సర్వాశారద స్వీయ కవితా గానం చేశారు. డాక్టర్ పరదేశిబాబు నిర్వహించారు.

మహాలక్ష్మి స్వరూపం సీతాదేవి



విజయవాడ కల్చరల్: మహాలక్ష్మి స్వరూపం సీతాదేవి అని ఆధ్యాత్మికవేత్త మండలీక కృష్ణకుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నూతన తెలుగు సంవత్సరం, శ్రీరామనవమి సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలో శ్రీమద్రామాయణం సప్తాహం శుక్రవారం నిర్వహించారు. సీతా చరితం అంశంగా శుక్రవారం కృష్ణకుమార్ ప్రసంగించారు. హిందూ సమాజంలో స్త్రీ ప్రవర్తనకు, ఆలోచనకు సీతా చరిత్ర మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. మాతృత్వానికి ప్రతిరూపంగా సీతను సీతమ్మ తల్లి అని పిలుస్తారని పేర్కొన్నారు. సీతా జననం, శ్రీ రామునితో వివాహం, అరణ్యవాసం, సీతాపహరణ, లంకా దహనం, సీత అగ్ని ప్రవేశం అంశాలను ఆయన శ్రావ్యంగా వినిపించారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మరుధూరి నరసింహాచార్యులు సేవా ధర్మం అంశంగా ప్రసంగిస్తారని ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో యువ శతావధానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం యువ శతావధానం జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శుక్రవారం ఉప్పలదడియం భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అవధానంలో తొలి అచ్చ తెలుగు అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, మెట్ట వెంకటేశ్వరరావు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, పింగళి వెంకటకృష్ణారావు, కేఎస్ రామారావు, పీ భానుమతి, డాక్టర్ దండిభోట్ల దత్తాత్రేయశర్మ పాల్గొన్నారు. శతావధానంలో పాల్గొన్న ప్రముఖులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఈఓ రామారావు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఇంటర్ ఫలితాల్లో పేట విద్యార్థుల ప్రతిభ


కె.అనురాధ


పి.హర్షిత్


వాగ్దేవి మహిళా కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షా ఫలితాల్లో జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తమ చాటారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో స్థానిక విశ్వభారతి జూనియర్ కళాశాల, శ్రీలక్ష్య ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు కె.అనురాధ, పి.హర్షిత్ 1000 మార్కులకుగాను 986మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 9మంది విద్యార్థులు 1000కి 975 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఏడుగురు విద్యార్థులు 470మార్కులకుగాను 450మార్కులు సాధించారు. వీరిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు పద్మశేఖర్, కె.కిషోర్, జి.నారాయణరావు అభినందించారు. అదేవిధంగా వాగ్దేవి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన సెకండియర్ ఎంపీసీలో షేక్ షైనాజ్ 983మార్కులు, బైపీసీలో బాలు భార్గవి 962మార్కులు, సీఈసీలో ఎ.సుప్రియ 967మార్కులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎం.రోషిత్, ఎంపీసీ గ్రూప్ సబ్జెక్ట్స్‌లో 270మార్కులకుగాను 270 మార్కులు సాధించాడు. బైపీసీలో షేక్ సత్తార్ 420మార్కులకుగాను 440మార్కులు, సీఈసీలో ఎస్.నటరాజ్ 500మార్కులకుగాను 471మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సురేష్, కరస్పాండెంట్ సరిత అభినందించారు. జేఆర్‌సీ కళాశాలకు చెందిన సెకండియర్ బైపీసీ విద్యార్థి టీవీఎస్.కృష్ణ సౌమ్య 1000కి 986మార్కులు, వి.సాయిరోషిణి 984మార్కులు, ఫస్టియర్ బైపీసీలో ఎస్.శ్రావణి 440మార్కులకుగాను 429మార్కులు, సుధా సాహు 422 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జేఆర్సీ యాజమాన్యం అభినందించారు.

కొండంత అభిమానం చూపిన కూలీలు


ఎమ్మెల్యే ఉదయభానుతో ఆప్యాయంగా మాట్లాడుతున్న వ్యవసాయ కూలీలు

నందిగామ: వాళ్లంతా మండుటెండను సైతం లెక్క చేయకుండా నిత్యం శ్రమించే వ్యవసాయ కూలీలు...పొలాల్లో పనిచేసుకునే వారంతా జగ్గయ్యపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సామినేని ఉదయభానును చూసి ఒక్కసారిగా పరుగులుతీస్తూ వచ్చి ఆయన్ను ఎంతో ఆపాయ్యంగా పలకరించారు. తమ అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తున్ననాయకుడు ఉదయభానుపై అభిమానాన్ని చూపించి, మళ్లీ మీరే గెలవాలయ్యా అంటూ ఆశీర్వదించారు. ఈ ఘటన నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామమైన రామిరెడ్డిపల్లి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మాకు సీఎం జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు ఏ లోటు లేదు...ఆయన దయవల్ల తామంతా సంతోషంగా జీవిస్తున్నామని వారు ఉదయభానుకు వివరించారు. ఆ మాటలు విన్న ఉదయభాను త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరగా, అందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కూలీలు చూపించిన అభిమానానికి ఎమ్మెల్యే ఉదయభాను వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

చెక్‌పోస్టుల వద్ద భద్రత కట్టుదిట్టం

ఎస్ఈబీ ఏసీ విజయ


గరికపాడు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సెబ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ


కంచికచర్లలో రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

జగ్గయ్యపేట, నందిగామ, కంచికచర్ల, వీరులపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గరికపాడు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) కె.విజయ సూచించారు. జగ్గయ్యపేట మండలంలోని గరికపాడు, నందిగామ మండలంలోని జొన్నలగడ్డ, వీరులపాడు మండలంలోని పెద్దాపురం సరిహద్దు చెక్‌పోస్టులను శుక్రవారం ఆమె పరిశీలించారు. స్వయంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశామన్నారు. ముఖ్యంగా తెలంగాణ నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. అక్రమ మద్యం, నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువుల తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఈబీ సీఐలు మణికంఠరెడ్డి, శ్రీధర్, జీఎస్టీ అధికారి బషిరుద్దీన్, ఫారెస్ట్ బీట్ అధికారి ప్రసన్నలీలా, ఎంవీఐ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సెబ్ కార్యాలయం తనిఖీ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, నగదు తరలించినా వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ హెచ్చరించారు. కంచికచర్లలోని సెబ్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద వాహనాల రాకపోకలు క్షుణ్నంగా తనిఖీ చేయాలని సెబ్‌సిబ్బందిని ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద పనిచేసే సిబ్బంది ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చెక్‌పోస్టు వద్ద 24 గంటలు తనిఖీ చేపడుతున్నామని వివరించారు. అనంతరం వీరులపాడు మండలంలోని పెద్దాపురం చెక్‌పోస్టును ఆమె తనిఖీ చేశారు. ఆమె వెంట సెబ్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ వై.నాగేంద్రకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి

వేదాద్రి(జగ్గయ్యపేట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతలకు అన్ని రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని చిల్లకల్లు ఎస్‌ఐ సతీష్ కోరారు. మండలంలోని వేదాద్రిలో శుక్రవారం రాత్రి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చింంచారు. అనంతరం గ్రామంలో పోలీస్ కవాతు నిర్వహించారు.

అమ్మవారికి గాజులతో అర్చన

మధురానగర్(విజయ వాడసెంట్రల్): వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముత్యాలంపాడు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి గాజులతో అర్చన నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎన్ రాజు పర్యవేక్షించారు.